# 49. నిన్రాఋషి నెడుమరనాయనారు
# 50. మంగయార్ కరశియార్

నిన్రా ఋషి నెడుమరనాయనారు మధుర రాజ్యాన్ని పాలించిన పాండ్యరాజు. ఆయనకు గూనువుండేది. అందుచేత ఆయనను అందరూ కూన్‌పాండ్యన్ అని పిలిచే వారు. ఆయన సహజంగా కవి. మంచి పండితుడు. తమిళనాడులోని కవులను పండితు లను సమాదరించాడు. తమిళ సంగమును ఏర్పరచినది కూడ ఆయనే.

ఆయన భార్య మంగయార్‌కరిశియార్. ఆమె చోళరాజు కుమార్తె. శివారాధన పరురాలు. శివుడంటే చాల ఇష్టమామెకు. ఆయన మంత్రి కులచ్చిరాయి నాయనారు. ఆ మంత్రి గూడ పరమ శివభక్తుడు. తిరుజ్ఞాన సంబంధార్ ఈ ఇరువురు మంచిత నము గూర్చి పడిగములను పాడాడు.

కూన్‌పాండ్యన్ - జైన మతప్రాబల్యంతో జైనుడయ్యాడు. రాణి, మంత్రి - ఏదో ఒక పని చేయకపోతే - రాజుగారి మూలాన్ని - శైవ మత మంతరించునేమోనని భయ పడ్డారు. ఇలా వుండగా పరమ శివభక్తుడు జ్ఞాన సంబంధనాయనారు మధురకు వచ్చు చున్నట్లు, పోలిమేరలోనున్నట్లు తెలిసి - వానిని పట్టణములోనికి రాణి, మంత్రి ఆహ్వానిం చారు. జైనులు జ్ఞాన సంబంధనాయనారును చంపింప జూచారు. మహాభక్తుడు జ్ఞాన సంబంధనాయనారు ఒక పడిగము పాడగానే - రాజుగారి గూను, విపరీతమైన నొప్పి మాయమయ్యాయి. దీని మూలంగా శైవమతమంటే రాజుగారికి ఇష్టమేర్పడింది. శివభక్తి లో పరాకాష్ఠ నందుకొన్నాడు. ఆ శివ భక్తి తత్పరతలో నిన్రాఋషి - నెడుమరనాయనారు గా ప్రసిద్ధికెక్కాడు. గూనుపోయి నిటారుగా ఎత్తుగా నిలిచాడుకాన ఆ పేరు వచ్చింది.

ఈ మధురరాజు ఉత్తరదెసనున్న తిరునల్వేలి రాజులను జయించి శైవమత వ్యాప్తికి బహుధా తోడ్పడ్డాడు. గురువుఎడ వారి ప్రేమ, అనన్య భక్తి, సేవలు పరమ శివుని ఆకట్టుకున్నాయి. దంపతులకు శివుడు ముక్తి నొసగాడు.